
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 6 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టగా రూ.18 వేలు, కనిష్టం రూ.9 వేలు, సరాసరి రూ.14 వేల ప్రకారం ధర పలికాయి.



టమాట కిలో రూ.15

అనంత శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.4, సరాసరిన రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.8°/18.3°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం మొదలైంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ముగిసిన పింఛన్ల పంపిణీ



అనంతపురంలో పార్వతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బాలాజీ నాయక్

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో మంగళవారంతో ముగిసింది. మార్చి నెలకు సంబంధించి జిల్లాలో 2,73,627 మంది పింఛన్‌దారులుండగా, ప్రభుత్వం రూ.81,67,37,500 మంజూరు చేసింది. వలంటీర్ల సహకారంతో కేవలం 5 రోజుల్లోనే 99.25 శాతం అంటే 2,71,479 మందికి రూ.81,02,71,500 పింఛన్ కానుక మొత్తం అందించినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా రాష్ట్రంలోనే 7వ స్థానంలో నిలిచిందన్నారు.

మిర్చి @ 22 వేలు



మార్కెట్ యార్డుకు వచ్చిన మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర క్రమక్రమంగా పెరుగుతోంది. మంగళవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు 77 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. ఇందులో మొదటి రకం క్వింటా గరిష్టంగా రూ. 22 వేలు, రెండో రకం రూ.10 వేలు, మూడో రకం మిర్చీ క్వింటా రూ.8,100 మేర ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

పుట్టపర్తి అర్బన్: భారత సైన్యంలో ప్రవేశించాలనుకునే యువత కోసం 'అగ్నివీర్' ఆర్మీ రిక్రూట్‌మెంట్ 2024–25 నోటిఫికేషన్ విడుదలైంది. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, అగ్నివీర్ ట్రేడ్ మ్యాన్ పోస్టులకు www.joinindianarmy. nic. in వెబ్‌సైట్ ద్వారా మార్చి 22వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. భారత సైన్యంలో చేరేందుకు ఇదో గొప్ప అవకాశమని, ఆసక్తి కలిగిన జిల్లా యువత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

11న అప్రెంటిస్‌షిప్ మేళా

లేపాక్షి: ఐటీఐ పూర్తి చేసిన యువతకు హిందూపురంలోని శ్రీనివాస ఐటీఐ కళాశాలలో ఈనెల 11వ తేదీన అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రాయపురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు https://apprenticeshipindia. org వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 11వ తేదీ ఉదయం 9 గంటలకంతా శ్రీనివాస ఐటీఐకి చేరుకోవాలని, విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 244 మంది గైర్హాజరు

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా రెండో సంవత్సరం విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ఇంగ్లిష్ పేపర్–2 పరీక్షకు 244 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 41 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, జనరల్ విద్యార్థులు 7,969 మందికి గానూ 7,788 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,062 మందికి గానూ 999 మంది హాజరయ్యారు. మొత్తంగా 244 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈఓ) రఘునాథరెడ్డి తెలిపారు.

ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్‌గా జాన్సన్



బాధ్యతలు తీసుకున్న డాక్టర్ జాన్సన్

పుట్టపర్తి టౌన్: జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్‌గా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ కోఆర్డినేటర్‌గా పనిచేసిన రవికిశోర్ మహానంది వ్యవసాయ కళాశాలకు బదిలీ కాగా, వైఎస్సార్ జిల్లా ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్‌ను ప్రభుత్వం పుట్టపర్తికి బదిలీ చేసింది. దీంతో మంగళవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రైతులకు అందుబాటులో ఉంటూ నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

అన్నదాతకు వెన్నుదన్ను

- నేడు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాలోని 1,17,005 మంది రైతులకు రూ.105.03 కోట్ల లబ్ధి
- ఉమ్మడి అనంతపురం జిల్లాకు రూ.356.25 కోట్లు
- ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లో పరిహారం
- గతంలో ఎన్నడూ లేని విధంగా చేయూత

21
జిల్లాలోని కరువు మండలాల సంఖ్య

73,565.83 హెక్టార్లు
దెబ్బతిన్న పంటల విస్తీర్ణం


1,17,005
నష్టపోయిన రైతుల సంఖ్య

రూ. **105.04** కోట్లు
ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం

పుట్టపర్తి అర్బన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు వేసే ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తున్నారు. పంటల సాగుకు పెట్టుబడి దగ్గర నుంచి విత్తనాలు, ఎరువులు సైతం సబ్సిడీతో ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే అందిస్తున్నారు. పంట పండితే మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇస్తూ ఆదుకుంటున్నారు. గతానికి భిన్నంగా ఏ సీజన్‌లో పంటలకు నష్టం జరిగితే సీజన్ ముగిసేలోపే పరిహారం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో 2023 ఖరీఫ్‌లో వర్షాభావంతో పంటలు నష్టపోయిన జిల్లాలోని 21 మండలాల రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ బుధవారం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

జిల్లాకు రూ.105.04 కోట్లు..

వర్షాభావ పరిస్థితుల కారణంగా గత ఖరీఫ్‌లో జిల్లా పరిధిలో 73,566 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో 1,17,005 మంది రైతులకు రూ.105.04 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కానుంది. అగళి, అమరాపురం, బత్తలపల్లి, బుక్కపట్నం, చిలమత్తూరు, ధర్మవరం, గోరంట్ల, గుడిబండ, హిందూపురం, కనగానపల్లి, కొత్తచెరువు, లేపాక్షి, మడకశిర, ముదిగుబ్బ, ఎన్పీకుంట, పరిగి, రొద్దం, రొళ్ల, సోమందేపల్లి, తాడిమర్రి, తలుపుల తదితర 21 మండలాలు కరువు జాబితాలో ఉన్నాయి. అత్యధికంగా కనగానపల్లి మండలానికి రూ.9.58 కోట్లు, ధర్మవరం మండలానికి రూ.9.23 కోట్లు, ముదిగుబ్బకు రూ.8.54 కోట్లు, గుడిబండకు రూ.6.55 కోట్లు, రొద్దంకు రూ.6.16 కోట్లు, రొళ్లకు రూ.6.13 కోట్లు, అమరాపురానికి రూ.5.84 కోట్లు, మడకశిరకు రూ.5.75 కోట్లు, బత్తలపల్లికి రూ.5.44 కోట్లు, గోరంట్లకు రూ.5.07 కోట్ల మేర లబ్ధిదారుల ఖాతాల్లో పరిహారం జమ కానుంది. అలాగే అనంతపురం జిల్లాలోని 28 మండలాలను కరువు జాబితాలో చేర్చగా, ఆ జిల్లాకు రూ.251.21 కోట్లు మంజూరైంది.



18 పంటలకు తీవ్ర నష్టం

2023 ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల జిల్లా రైతులు సాగు చేసిన అరికలు, మినుములు, సజ్జలు, ఆముదం, పత్తి, అలసంద, చిక్కుడు, పెసలు, వేరుశనగ, ఉలవలు, జొన్న, మొక్కజొన్న, కొర్ర, రాగి, కంది, పొద్దు తిరుగుడు తదితర పంటలకు నష్టం జరిగింది. వీటిలో అత్యధికంగా 37,962 హెక్టార్లలో వేరుశనగ పంటకు నష్టం జరిగింది. ఆ తర్వాత 16,241 హెక్టార్లలో మొక్కజొన్న, 9,548 హెక్టార్లలో కంది, 3,401 హెక్టార్లలో ఆముదం, 2,720 హెక్టార్లలో రాగి, 2,656 హెక్టార్లలో పత్తికి నష్టం వాటిల్లింది. ఇందులో వేరుశనగకు రూ.64.54 కోట్లు, మొక్కజొన్నకు రూ20.30 కోట్లు, కందికి రూ. 9.55 కోట్లు, రాగికి రూ.2.31 కోట్లు, పత్తికి రూ.4.52 కోట్లు, ఆముదంకు రూ.2.89 కోట్లు మంజూరైంది. బుధవారం సీఎం వైఎస్ జగన్ కంప్యూటర్‌లో బటన్ నొక్కి పరిహారం నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నారు.

నేడు కలెక్టరేట్‌లో మెగా చెక్కు పంపిణీ

జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు మంజూరైన ఇన్‌పుట్‌కు సంబంధించిన మెగా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు.

రైతు సంక్షేమ ప్రభుత్వమిది



పంటలు వేసేందుకు సాయం.. విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రాలు..చివరకు పంట నష్టపోయినా సాయం అందిస్తున్న ఏకైక సర్కార్ జగనన్నదే. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం. నాకు బత్తలపల్లి మండలం రాఘవంపల్లిలో 3 ఎకరాలుండగా, చీనీచెట్లు నాటిన. వర్షాలు లేక పంట నష్టపోగా రూ.30 వేలు పరిహారం అందించారు. ఇలా ఎప్పుడూ చీనీచెట్లకు, ఇతర పంటలకు పరిహారం ఇచ్చింది లేదు. ఇప్పుడు కూడా ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇస్తున్నారు.

–యర్రభూమి రామచంద్రారెడ్డి, రైతు, రాఘవంపల్లి, బత్తలపల్లి మండలం

మా పాలిట దేవుడు



గతంలో ఏ ప్రభుత్వమూ రైతుల కోసం ఇంతలా చేయలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు సబ్సిడీతో అందిస్తున్నారు. రైతు భరోసా కింద ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం చేస్తున్నారు. పంటలు నష్టపోతే వెంటనే పరిహారం అందేలా చూస్తున్నారు. అందుకే సీఎం జగనన్న మా పాలిట దేవుడు.

–ముత్యాలు, రైతు, అప్పరాచెరువు, బత్తలపల్లి మండలం

రైతుల పక్షపాతి సీఎం జగన్



సీఎం వైఎస్ జగన్ రైతుల కోసం రైతు భరోసా, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ వంటి పథకాలను అమలు చేస్తూ సాగును పండుగ చేస్తున్నారు. వీటితో పాటు పంట నష్టం జరిగినపుడు ఏ సీజన్‌కు ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తూ ఆదుకుంటున్నారు. గత ఖరీఫ్ పరిహారం ఇంత త్వరగా వస్తుందని అనుకోలేదు.

– వెంకటరాముడు, రైతు, తగరకుంట, కనగానపల్లి మండలం

1,500 ఓట్లు దాటితే అనుబంధ పోలింగ్ కేంద్రం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో పాల్గొన్న అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

- అఖిలపక్ష సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఏ కేంద్రంలోనైనా ఓటర్ల సంఖ్య 1,500 దాటితే అనుబంధంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తామన్నారు. ఓటరు జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించామన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నియోజక వర్గ స్థాయి సమావేశాల్లో పాల్గొనాలని సూచించారు.

ప్రతిపాదనలన్నీ ఈసీకి పంపాం

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఎన్నికల సిబ్బంది నియామకం ఇప్పటికే పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు పరిశీలన పారదర్శకంగా నిర్వహించామన్నారు. మృతుల ఓట్లను వంద శాతం తొలగించామన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పులకు 10 అభ్యంతరాలు వచ్చాయని, అలాగే లొకేషన్ మార్పుకు 19, నామకరణం మార్పుకు 94 ప్రతిపాదనలు వచ్చాయన్నారు. వాటిని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించామన్నారు. 1,450 నుంచి 1,500 మంది ఓటర్లు ఉంటే సహాయక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. అలాగే ఒక కుటుంబంలోని వారంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మీడియా ప్రతినిధులకూ త్వరలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి, కదిరి, మడకశిర నియోజక వర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వంశీకృష్ణ, గౌరీశంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి



శిక్షణకు హాజరైన పోలీస్ సిబ్బంది

- శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఎన్నికల విధులపై పోలీసుశాఖలోని ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధులు, కోడ్ నిబంధనలను వివరించారు. అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేయడం, శాంతి భద్రతల పరిరక్షణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసుల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల కోడ్, ప్రవర్తనా నియమాల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసి ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడంతోపాటు వాటిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. అలాగే గ్రామాల్లోని రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ముందస్తు సమాచారం సేకరించి ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

చంద్రబాబును జనం నమ్మడం లేదు



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

- ఆయనకు ఇవే చివరి ఎన్నికలు
- జనం లేక టీడీపీ 'కదలి రా' సభ వెలవెలబోయింది
- సంక్షేమ పథకాలపై ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధం
- ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వం మాదే
- విలేకరుల సమావేశంలో మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: అధికార దాహంతో అలవిగానీ హామీలిస్తున్నా చంద్రబాబును ఎవరూ నమ్మడం లేదని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. మంగళవారం ఆమె పరిగిలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు ముంగిళ్లలోనే సేవలు అందించారన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ వలంటీర్లు ప్రాణాలను తెగించి ప్రజలకు సేవలు అందించారన్నారు. అలాంటి వారిపై టీడీపీ అధినేత చంద్రబాబు లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థను మాఫియాగా అభివర్ణించారన్నారు. కానీ సోమవారం పెనుకొండలో నిర్వహించిన సభలో వలంటీర్ వ్యవస్థపై కపట ప్రేమను ప్రదర్శిస్తూ మాట్లాడటం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

అది చంద్రబాబు రాజకీయ ఉద్వాసనసభ

సోమవారం పెనుకొండలో నిర్వహించిన 'రా కదలి రా' సభ టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్వాస సభగా మంత్రి ఉషశ్రీ అభివర్ణించారు. ఆయనకు ఇదే రాజకీయ చివరి సభగా మారనుందన్నారు. ఇప్పటికే వయోభారంతో ఉన్న ఆయన.. తన కుమారుడు లోకేష్‌ను గద్దెనెక్కించడానికి జనసేన పార్టీని అద్దెకు తెచ్చుకున్నారన్నారు. అందువల్లే జనం కూడా పెద్దగా మద్దతు తెలపడం లేదన్నారు. పెనుకొండ సభకు వచ్చిన జనమే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సిద్ధం' సభకు ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో సగభాగం కూడా టీడీపీ 'కదలి రా' సభకు ప్రజలు రాలేదని ఎద్దేవా చేశారు.

సంక్షేమంపై ఓపెన్ చాలెంజ్‌కు సిద్ధం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అవినీతి అక్రమాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. దీనిపై ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమన్నారు. అన్ని వర్గాలకూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అండగా నిలబడిందన్నారు. విలువలు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ఏపీలోని కోట్లాది ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. టీడీపీ, ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు చేసినా చివరికి జగనన్నపై ప్రజలకు ఉన్న విశ్వసనీయతను ఎవరూ చెడగొట్టలేరన్నారు. చల్లటి గాలినిచ్చే 'ఫ్యాను' స్పీడును ఆపడం టీడీపీ, జనసేన, పచ్చ మీడియాకు సాధ్యం కాదన్నారు.

నాలుగింటిపై పీటముడి

- ఉమ్మడి జిల్లాలో నాలుగు టీడీపీ టికెట్లపై ఎటూ తేల్చని చంద్రబాబు
- కందికుంటకు డీడీల కేసులో శిక్షతో ఇరకాటం
- అనంతపురం అర్బన్‌లో టీడీపీకి జనసేన పోటు
- గుంతకల్లులో జితేందర్‌గౌడ్‌కు గుమ్మనూరు షాక్
- ధర్మవరంలో డబ్బువైపే మొగ్గు చూపుతున్నారన్న విమర్శలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల్లో టీడీపీ అభ్యర్థులెవరో చంద్రబాబు తేల్చలేకపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సరైన అభ్యర్థులు దొరక్క సతమతమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ప్రకటించిన స్థానాల్లో అసమ్మతులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. అభ్యర్థులకు వ్యతిరేకంగా రోడ్లెక్కారు. చంద్రబాబు స్వయంగా నచ్చజెప్పినా వినడం లేదు. ఈ క్రమంలోనే మిగిలిన నాలుగు స్థానాల్లో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. కదిరి, ధర్మవరం, గుంతకల్లు, అనంతపురం నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక బాబుకు తీవ్ర సంకటమే అయ్యిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పుట్టపర్తి టికెట్ కూడా ఇప్పటికీ ప్రకటించలేదు. కానీ ఇక్కడ పల్లె కుటుంబానికే టికెట్ దక్కే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

కందికుంటను వెంటాడుతున్న డీడీల కేసు

కదిరి నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో గెలిచి, 2019లో ఓడిపోయిన కందికుంట ప్రసాద్‌కు డీడీల కేసులో శిక్ష పడింది. ఈ పరిస్థితుల్లో ఆయన పోటీచేసే అవకాశం లేదు. ఆయన భార్యకు టికెట్ ఇస్తే ఇబ్బందులు తలెత్తుతాయని బాబు భయపడుతున్నారు. కందికుంట మాత్రం తనదే టికెట్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

ధర్మవరంలో సంకటం

ధర్మవరం సీటు కోసం కొన్ని నెలలుగా పరిటాల శ్రీరామ్ విశ్వప్రయత్నం చేస్తున్నారు. కానీ వరదాపురం సూరి తనదే టికెట్ అంటున్నారు. ఇద్దరి మధ్యా కొన్ని రోజులుగా యుద్ధవాతావరణం నెలకొంది. వీరి వర్గీయులు పరస్పర దాడులకు సైతం తెగబడుతున్నారు. ఒకవిధంగా ధర్మవరంలో స్థానికులు పరిటాల, వరదాపురం వర్గాల దాడులు, ప్రతిదాడులతో తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

చౌదరికి జనసేన పోటు తప్పదా?

అనంతపురం అర్బన్ నియోజకవర్గ టికెట్ ఈసారి పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే గనుక నిజమైతే వైకుంఠం ప్రభాకర్ చౌదరికి ఇక రాజకీయ సన్యాసమే అంటున్నారు స్థానికులు. ఈ సీటులోనూ ఇప్పటి వరకూ స్పష్టత రాలేదు. పవన్‌కల్యాణ్ ఇక్కడ పోటీ చేస్తే తాను సీటు త్యాగం చేస్తానని చౌదరి అంటున్నారు. అసలు భీమవరం నుంచే పవన్‌కల్యాణ్ వెళ్లిపోగా..అనంతపురం ఎందుకొస్తారంటూ చౌదరిపై ప్రత్యర్థులు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు.

జితేందర్‌కు గుమ్మనూరు పొగ!

గుంతకల్లులో సీనియర్ నేతగా ఉన్న జితేందర్ గౌడ్‌కు ఈసారి బాబు ఝలక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ గుమ్మనూరు జయరాంకు టీడీపీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. గుమ్మనూరుకు టికెట్ ఇస్తే పర్యవసానాలు ఎలా ఉంటాయన్నది చంద్రబాబుకు అంతుచిక్కడం లేదు. దీంతో ఇక్కడ టికెట్ ఎవరికి ఇవ్వాలో తేల్చుకోలేక పోతున్నారు. మరోవైపు రెండు ఎంపీ సీట్లమీద కూడా ఇప్పటికీ స్పష్టత రాలేదు.

క్లుప్తంగా

భానుడి ఉగ్రరూపం

● వడదెబ్బతో వృద్ధురాలి మృతి

హిందూపురం అర్బన్: భానుడు ఉగ్రరూపం ధరించాడు. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే సుర్రుమంటున్నాయి. హిందూపురం పట్టణంలోని సడ్లపల్లికి చెందిన వెంకమ్మ (61) మంగళవారం రేషన్ తీసుకునేందుకు స్టోర్ వద్దకు వెళ్లింది. అక్కడ ఎండ వేడిమికి కుప్పకూలిపోయింది. కొద్ది సేపటికే ప్రాణం విడిచింది. వడదెబ్బ కొట్టడంతో చనిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

చెరువులో మహిళ మృతదేహం



పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు నాగుల కనుమ వద్ద బుక్కపట్నం చెరువులో మంగళవారం ఓ మహిళ మృతదేహం కనిపించింది. మృతదేహం బోర్లపడి ఉండటంతో ఎవరనేది స్థానికులు గుర్తించలేకపోయారు. మృతదేహం వెలికి తీస్తే గానీ ఎవరనేది తెలియదు. మృతదేహాన్ని బుధవారం వెలికి తీస్తామని పోలీసులు తెలిపారు. సదరు మహిళ ఆత్మహత్య చేసుకుందా.. ఎవరైనా హత్య చేసి చెరువులో పడేశారా అనేది దర్యాప్తులో తేలుతుందన్నారు.

కూలీ అనుమానాస్పద మృతి



మృతుడు బాలరాజు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గాంధీనగర్ రైల్వే గేటు సమీపంలో ఓ కూలీ అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... కృష్ణా జిల్లా నాగాయలంక మండలానికి చెందిన బాలరాజు (50) రైల్వే ట్రాక్ పనులు చేసేందుకు ధర్మవరం వచ్చాడు. మంగళవారం గాంధీనగర్ రైల్వే గేటు పనులు ముగించుకుని వెళ్లిన బాలరాజు రైల్వే పట్టాలకు సమీపంలో విగతజీవిగా పడి ఉన్నాడు. నోటిలో బురుగు వచ్చింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఆత్మహత్య చేసుకున్నాడా, లేక ఎవరైనా హత్య చేశారా అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. బాలరాజుకు భార్య లీల, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

సర్వదేవతల సంగమమే సంగమేశ్వరం

● ఏడు నుంచి శివరాత్రి మహోత్సవాలు



పంచలింగ సంగమేశ్వరుడు



సంగమేశ్వరంలోని ఆలయం

బత్తలపల్లి: ఎత్తయిన కొండలు.. విశాలంగా పరచుకున్న పంట పొలాలు.. పచ్చదనం పరచుకున్న సుందర ప్రశాంత వాతావరణంలో వెలసింది సంగమేశ్వర క్షేత్రం. బత్తలపల్లి మండలం అప్పరాచెరువు పంచాయతీ పరిధిలో ఈ క్షేత్రం ఉంది. శివాలయం, రామాలయం, వెంకటేశ్వరాలయం, షిరిడీ సాయి ఆలయం, నవగ్రహాలు, సీతారామాంజనేయులు దేవాలయం, గంగమ్మ గుడి తదితర దేవాలయాల సమూహంతో నిండినందున సంగమేశ్వరంగా ప్రసిద్ధి చెందింది. ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద సరస్సులు ఉన్నట్టుగానే ఇక్కడ కూడా చిత్రావతి, దూబిలేరు, పాలేరు నదులు కలుస్తాయి. ప్రతి సంగమం వద్ద ఈశ్వరాలయం ఉన్నట్లుగానే ఇక్కడా శివుడిని ప్రతిష్టించారు. దీంతో ఈ క్షేత్రాన్ని సంగరామేశ్వరంగా కూడా పిలుస్తుంటారు. ఇలాంటివి ఉత్తర భారతదేశంలో దేవ ప్రయాగ, రుద్రప్రయాగ, నందిప్రయాగ, త్రివేణి సంగమంలో ఉన్నాయి. వాటి సరసన ఈ దేవాలయం కూడా నిలిచింది. వాటిని తీర్థప్రదేశాలుగా పిలుస్తారు. తీర్థ ప్రదేశాలకు మనదేశ చరిత్రలో అత్యంత ప్రముఖ స్థానం ఉంది. ఈ సంగమేశ్వరాలయానికి అదే విధమైన ప్రసిద్ధి ఉంది. సంగమేశ్వరంలోని ఈశ్వరాలయానికి సంబంధించి కొన్ని చారిత్రక ఆధారాలున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో ఆస్థాన మంత్రికి భరణంగా ఇచ్చి అప్పాజీ పేరుతో అప్పరాజుచెర్ల గ్రామాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ క్షేత్రంలో ఈ నెల ఏడో తేదీ నుంచి శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయి. మూడు రోజులపాటు ఉత్సవాలు సాగుతాయి. 8న బత్తలపల్లి, సంగమేశ్వర క్షేత్రంలోనూ పౌరాణిక నాటక ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు.

● బత్తలపల్లి శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయంలో ఈ నెల ఎనిమిదో తేదీ ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు జరగనున్నాయి. ఆ రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు స్వామి వారికి సామూహిక రుద్రాభిషేకం ఉంటుంది. 10 గంటల నుంచి ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి, స్వామి దర్శనంతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేస్తారు. 10.45 గంటల నుంచి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి అన్నదానం ప్రారంభమవుతుంది.

● సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరక్షేత్రంలోనూ, దంపెట్లలోని శ్రీలక్ష్మీచెన్నకేశవాలయంలోనూ, మాల్యవంతం, రామాపురంలోని వీరనారాయణస్వామి దేవాలయాల్లో సైతం శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

శివరాత్రి జాగారంతో శుభాలు



శివరాత్రి పండుగ రోజు జాగారం చేస్తే మంచి శుభఫలితాలు లభిస్తాయి. శివున్ని భక్తితో పూజించడం వల్ల అనుకున్న కార్యాలు జరుగుతాయి. ఉపవాసాలతో దీక్ష చేసి, మరుసటి దినం దీక్షలను ఉపసంహరించుకుంటారన్నారు. అదే విధంగా మాఘమాసం సందర్భంగా చేపట్టిన దీక్షలను సైతం భక్తులు శివరాత్రి పండుగ నుంచి ఉపసంహరించుకుంటారు.

– అమళ్లదిన్నె జయకుమార్, ఆలయ అర్చకులు, సంగమేశ్వర క్షేత్రం

రాయలసీమ చిత్రలేఖన పోటీల ఫలితాల వెల్లడి



విజేతలుగా నిలిచిన వారి చిత్రలేఖనాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: రాయలసీమ చిత్రలేఖన పోటీల ఫలితాలను రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన కేంద్రం నిర్వాహకులు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ఉద్యమనాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, డేవిడ్ శరత్‌కుమార్‌రెడ్డి, శేషాద్రి తదితరులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 118 మంది కుంచె నుంచి జాలువారిన 125 చిత్రాలు పోటీలకొచ్చాయని,నిందులో ప్రతిభ చాటుకున్న వారికి రూ.10 వేలు విలువ చేసే బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. విజేతలు సీనియర్ విభాగంలో పామిడి మండలం సొరకాయలపేటకు చెందిన గంగ మల్లయ్య ప్రథమ బహుమతి దక్కించుకోగా ఖమ్మం జిల్లాకు చెందిన పల్లం పిచ్చయ్య, శెట్టూరు మండలానికి చెందిన బడిగె రాజశేఖర్ ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారని వివరించారు. జూనియర్ విభాగంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, హిమబిందు, రేణిత వరుసగా తొలి మూడు స్థానాలు దక్కించుకున్నారన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చిత్రకారుడు ఎల్ఆర్ వెంకటరమణ, డాక్టర్ అంకె శ్రీనివాస్ వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డాక్టర్ ఎస్.వాసంతి, ప్రకాష్, జయదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లలో తగ్గిన టిక్కెట్ ధరలు

అనంతపురం సిటీ: ప్యాసింజర్ రైళ్లలో చార్జీలను తగ్గిస్తూ దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు చెప్పింది. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు వీలుగా అప్పట్లో ప్యాసింజర్ రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. కరోనా ప్రభావం పూర్తిగా తగ్గినా ప్రస్తుత తరుణంలో లాక్‌డౌన్‌కు ముందు ప్యాసింజర్ రైళ్లలో ఏ మేర చార్జీలు ఉన్నాయో అవే చార్జీలు కొనసాగించేలా నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు రత్నగిరిలో పర్యటించనున్న విదేశీ బృందం



రత్నగిరిలో అంబిక పొలంలో ఏటీఎం పద్ధతిలో సాగైన పంట

రొళ్ల: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పద్ధతి ద్వారా సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను యూరోప్, ఈజిప్టు దేశాలకు చెందిన వాల్టర్ లింక్, లూసీ వాలెస్, మెల్లిసా, హెల్మీ అబౌలీష్, అమర్ సహాబి, జస్టస్ హాని, అబౌలీష్‌తో కూడిన బృందం బుధవారం రత్నగిరిలో పర్యటించనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రకృతి వ్యవసాయం (డీపీఎం) జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్, మడకశిర డివిజన్ ఎంటీ రమేష్, రొళ్ల మండలం ఇన్‌చార్జ్ హనుమంతరాయప్ప మీడియాకు వెల్లడించారు. రత్నగిరిలో రైతు అంబిక పొలంలో ఏటీఎం పద్ధతిలో సాగు చేసిన ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్, గోరుచిక్కుడు, మొక్కజొన్న, అలసంద, సజ్జ, ఆకుకూరలు, రైతు దొడ్డేగౌడు పొలంలోని దానిమ్మ సాగులో అంతర పంటగా వేరుశనగ, అనుములు, అలసంద, సజ్జ పంటలను విదేశీ బృందం పరిశీలించనుంది. రైతు సుమలత కొబ్బరి తోటలో అరటి, వంగ, ఆకుకూరలు, రైతు మంజునాథ్ పొలంలో సాగు చేసిన మామిడి తోటలో పత్తిసాగు, అలసంద, పెసరు, అనుములు, సజ్జ, మల్బరీ, వేరుశనగ, రైతు శంకర్ పొలంలో సాగు చేసిన వక్కతోటలో అంతర పంటగా మిరియాలు, ఆకుకూరలు, కూరగాయల పంటలను పరిశీలించనుంది. రైతు నాగరాజు పొలంలో సాగు చేసిన మల్బరి తోటలో గోరుచిక్కుడు, అలసంద, సజ్జ, అనుములు ఇతరాత్ర 23 రకాల పంటల సాగుతో పాటు డ్రైప్యాడీ ద్వారా గోరుచిక్కుడు, ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్, ఆకుకూరలు, కూరగాయాలు ఇతరత్ర సాగు చేసిన పంటలను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

లేపాక్షి హుండీ ఆదాయం రూ. 5.68 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో హుండీ ఆదాయం రూ.5.68 లక్షల వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. మూడు నెలలకు సంబంధించి భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపును మంగళవారం చేపట్టారు. హుండీ ఆదాయం ఇదివరకటి కన్నా రెట్టింపు అయ్యిందని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారులు నరసింహమూర్తి, నాగేంద్రుడు, గ్రామ పెద్దలు, అర్చకులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. 69 రోజులకు గానూ రూ.48,00,793 నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.75,189 నగదుతో పాటు 34 అమెరికన్ డాలర్లు, 5 సౌదీ చైనా యాన్స్ సమకూరినట్లు ఆలయ ఈఓ భద్రాజీ తెలిపారు. అలాగే 220 గ్రాముల వెండి, 006.5 గ్రాముల బంగారాన్ని భక్తులు సమర్పించినట్లు వివరించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆర్టీసీ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యాచకుడి మృతి



యాచకుడి మృతదేహం

ధర్మవరం అర్బన్: ధర్మవరం రైల్వేస్టేషన్‌లో మంగళవారం పట్టాలు దాటుతున్న ఓ యాచకుడిని రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. 35 సంవత్సరాల వయసు కలిగిన ఈ వ్యక్తికి కొంతకాలంగా మతిస్థిమితం లేదని, ప్లాట్‌ఫాంపై ప్రయాణికులకు నమస్కారం పెడుతూ భిక్షాటన చేసేవాడని జీఆర్పీ ఎస్‌ఐ గోపికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని వివరాల కోసం ఆరా తీస్తున్నామని చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

గోరంట్ల: మండల కేంద్రం గోరంట్లలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మార్కెట్‌వీధిలో కార్పెంటర్ రోషన్‌వలి, ఆయేషా (33) దంపతులు నివాసముంటున్నరు. వీరికి ఇద్దరు పిల్లలు. మంగళవారం రోషన్‌వలి పనికెళ్లగా.. పిల్లలు బడికెళ్లారు. సాయంత్రం వేళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయేషా ఫ్యానుకు ఉరివేసుకుంది. కొద్దిసేపటి తర్వాత ఇరుగుపొరుగు, కుటుంబ సభ్యులు గమనించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

గిరిజన గర్జన విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్: ఈ నెల 10న జరిగే గిరిజన గర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నల్లశింగయ్యగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ డంగావత్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో గిరిజన సంఘం నాయకులతో కలసి బహిరంగ సభ పోస్టర్లను ఎమ్మెల్యే విడుదల చేశారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. గిరిజనులు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

సూరి, శ్రీరామ్ వర్గాలపై కేసు

● బత్తలపల్లి ఘర్షణలపై పోలీసుల చర్యలు

బత్తలపల్లి: బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి వర్గీయులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వర్గీయుల మధ్య సోమవారం బత్తలపల్లి కూడలిలో చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. ఈ ఘర్షణలో గాయపడిన ముదిగుబ్బ మండలం సంకేపల్లి గ్రామానికి చెందిన వెంగమనాయుడు ఫిర్యాదు మేరకు పరిటాల శ్రీరామ్ వర్గీయులైన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గంటాపురం జగ్గు అలియాస్ కొండేటి అప్పస్వామితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా ఇదే ఘర్షణలో గాయపడిన పరిటాల వర్గీయులు టీడీపీ కార్యకర్తలు ప్రశాంతకుమార్, సురేంద్ర ఫిర్యాదు మేరకు ముదిగుబ్బ మండలానికి చెందిన లక్ష్మీనారాయణ, గోనుగుంట్ల జయకృష్ణ, తాడిమర్రి మండలానికి చెందిన గోనుగుంట్ల ప్రతాప్ మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల: కదిరి, తనకల్లు గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని గోరంట్ల గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్రామనాయుడు తెలిపారు. ఈ నెల 25 తేదీలోపు www. aptgurkulam. ap. gov. inలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పై రెండు జూనియర్ కళాశాలల్లో 80 సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులకు ఏప్రిల్ 7న తనకల్లు గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఎంపికైన అమ్మాయిలకు ఇంటర్ సిలబస్‌తో పాటు ఐఐటీ, నీట్‌కు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 83090 05097 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గోరంట్ల: తాళం వేసిన ఇంటిలోకి దొంగలు చొరబడి బంగారు నగలు, నగదు అపహరించుకుపోయారు. గోరంట్లలోని వినాయకనగర్‌లో నివాసముంటున్న చాకలి శ్రీనివాసులు శివమాల ధరించాడు. మంగళవారం తెల్లవారుజామున ఇరుముడి కోసం భార్యతో కలిసి స్థానిక శివాలయానికి వెళ్లారు. ఇదే అదనుగు దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని ఐదు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.70వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

ప్రాణం తీసిన క్షణికావేశం

తలుపుల: క్షణికావేశం ఒకరి ప్రాణం తీసింది. భర్త చేతిలో భార్య హత్యకు గురైంది. వివరాలిలా ఉన్నాయి. బి.కొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందిన శివయ్యకు కదిరికి చెందిన పుష్పావతి (33)కి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. తరచూ గొడవపడుతుండేవారు. మంగళవారం కూడా గొడవపడ్డారు. క్షణికావేశానికి లోనైన శివయ్య రోకలిబండ తీసుకుని భార్యపై దాడిచేశాడు. దీంతో ఆమె అక్కడే కుప్పకూలిపోయింది. ఇరుగుపొరుగు వారు వచ్చి చూసేసరికి ఆమె చనిపోయింది. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

బొలెరో వాహనం బోల్తా

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల శివారులో 44వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం బొలెరో పికప్ వాహనం బోల్తాపడింది. ఓ ప్రముఖ కంపెనీకి చెందిన కొబ్బరి నూనె లోడుతో కర్నూలు నుంచి అనంతపురానికి బయలుదేరిన వాహనం... ఊబిచెర్ల శివారులోకి చేరుకోగానే ఒక్కసారిగా బ్రేక్ డ్రమ్ లాక్ అయింది. దీంతో ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే బోల్తాపడింది. ఘటనలో పామిడి మండలం ఎద్దులపల్లికి చెందిన డ్రైవర్ ప్రకాష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొబ్బరి నూనె డబ్బాలు చెల్లాచెదురుగా పడ్డాయి. వీటిలో కొన్ని పగిలిపోయాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జిల్లాలో వందశాతం పల్స్‌పోలియో



చిన్నారి చేతి వేలికి సిరా చుక్కను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: మూడు రోజుల పాటు నిర్వహించిన పల్స్ పోలియో జిల్లాలో వందశాతం నమోదైనట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పెడపల్లి, కొట్లపల్లి, పెద్దతండా గ్రామాల్లో పర్యటించి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...తొలిరోజు ఆదివారం ప్రత్యేక కేంద్రాల్లో 0 -5 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన 98.5 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. మిగతా పిల్లల కోసం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేశారన్నారు. మొత్తంగా జిల్లాలోని 2,09,015 మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండులు, రైల్వే స్టేషన్, పాఠశాలలు, జన సమూహం ఉన్న ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఆయన... ఆయా గ్రామాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సిబ్బంది పోలియో చుక్కల పంపిణీ కోసం ఇంటిని సందర్శించారా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే చుక్కల మందు వేసిన తర్వాత చిన్నారులకు వేలికి రాసిన సిరాను పరిశీలించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంట సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్ఎన్ లలితకుమారి, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సిబ్బంది రాధ, సుహాసిని, జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి




కొడికొండ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

చిలమత్తూరు: పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని కొడికొండ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కరెంటు సరఫరా, మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, తాగునీరు తదితర సౌకర్యాలన్నీ కల్పించాలని తహసీల్దార్ భాగ్యలతకు సూచించారు.

కిడ్నాప్ కేసులో మహిళకు 3 నెలల జైలు

అనంతపురం: కిడ్నాప్ కేసులో ఓ మహిళకు 3 నెలల జైలు శిక్ష పడింది. ముద్దాయికి రూ.2 వేల జరిమానా విధించారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలానికి చెందిన కే. కుతిజ 2017లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరేళ్ల బాలుడు ఎం. జయచంద్రను కిడ్నాప్ చేసింది. దీనిపై మసీదు కొట్టాలుకు చెందిన బాలుడి తండ్రి రామాంజి అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలిని అరెస్టు చేశారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మొదటి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పవిత్ర విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో మంగళవారం కే. కుతిజకు 3 నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. ఏపీపీ సుచిత్ర, హెడ్ కానిస్టేబుల్ సాలప్ప, కానిస్టేబుల్ జగదీష్, కుమార్‌ను డీఎస్పీ వీర రాఘవరెడ్డి అభినందించారు.

జగనన్న చొరవతో పంప్‌సెట్లకు ఫుల్ 'పవర్'



మేడాపురంలో 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: విద్యుత్ సరఫరాలో అంతరాయం తొలగించి వ్యవసాయ పంప్‌సెట్లకు పూర్తి స్థాయి ఓల్టేజీ అందించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మేడాపురం గ్రామ సమీపంలో రూ.2.80 కోట్లతో నూతనంగా ఏర్పాటుచేసిన 33-11కేవీ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పంటలు సక్రమంగా పండించుకునేందుకు మేడాపురానికి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యేలు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మేడాపురానికి రోడ్డుసౌకర్యం కల్పిస్తామన్నారు. రిజర్వాయర్లను నిర్మించి పంటల సాగుకు అనుకూలం కల్పిస్తామన్నారు. జగనన్న చొరవతో పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీటిని అందించామన్నారు. రూ.49కోట్లతో అన్ని గ్రామాలకు తాగునీటిసౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తేవాలన్నారు. అనంతరం గుర్రప్పస్వామి ఆలయానికి రూ.లక్ష, శివాలయానికి రూ.50వేలు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, సానే రాజారెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, నాయకులు ప్యాదిండి నరసింహారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, మేడాపురం సూర్యనారాయణ, రామకృష్ణారెడ్డి, మనేరు నరసింహులు, లక్ష్మిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మండల నరసింహులు, ట్రాన్స్‌కో ఈఈ గంగాధరం, డీఈ నాగేంద్ర, ఏడీఈ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దున్నపోతు దాడిలో వృద్ధురాలి మృతి



మృతురాలు ఈరమ్మ

రొళ్ల: దున్నపోతు దాడిలో ఓ వృద్ధురాలు ప్రాణం కోల్పోయింది. ఎం.రాయాపురం పంచాయతీ ఎంఆర్ గొల్లహట్టికి చెందిన ఈరమ్మ (72) మంగళవారం మధ్యాహ్నం పశువుల మేత కోసం పొలానికి వెళ్లింది. అక్కడ మేత తీసుకుని చీకటి పడ్డాక ఇంటికి బయల్దేరింది. దేవుని పేరు మీద వదిలిన ఓ దున్నపోతు వెనుక నుంచి ఈరమ్మపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడి కిందపడిపోయిన ఆమెను కొద్దిసేపటి తర్వాత గ్రామస్తులు గమనించి ఆస్పత్రికి తరలించేలోపు ప్రాణం విడిచింది. ఈమె భర్త ఇది వరకే మృతి చెందారు. కుమారుడు కరియన్న ఉన్నాడు.

దున్నపోతులతో భయాందోళన

ఎంఆర్ గొల్లహట్టి చుట్టుపక్కల గ్రామాల్లో కొల్లాపురమ్మ, మారెమ్మ అమ్మవార్ల పేరు మీద నాలుగైదు దున్నపోతులు వదిలారు. ఇవి రాత్రనక, పగలనక పొలాల్లో తిరుగుతూ పంట ధ్వంసం చేస్తుంటాయి. ఒకదానికొకటి పోటీపడుతూ పరుగులు తీసే క్రమంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.